క్లుప్తంగా

నేడు అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

కొందుర్గు: మండలంలోని ఉమ్మెంత్యాల గ్రామంలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని యువజన సంఘం సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతారని, అదేవిధంగా వక్తలుగా రెంజర్ల రాజేశ్, బైరి నరేశ్ రానున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, చిన్నషాపూర్ గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారి రాజేష్‌బాబు తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అప్పారెడ్డిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, చిన్నషాపూర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రాజేష్ బాబు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటక ప్రదర్శన



వీధి నాటకంలో పాటలు పాడుతున్న కళాకారులు

షాబాద్: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటకం బుధవారం రాత్రి షాబాద్ మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామంలో ఘనంగా జరిగింది. వీధి నాటకం మూడో రోజు రాత్రి నాటకంలో బ్రహ్మంగారు, గోవిందమ్మ, శివ కోటయ్య, ప్రమదాంబ వేశధారణలు ప్రజలను ఆకట్టుకున్నాయి. నేటికి ఇంకా గ్రామాల్లో వీధి నాటకాలపై ప్రజలకు మంచి ఆసక్తి ఉందన్నారు. ఈ నాటకాన్ని పంతులు గంగపూరం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మాజీ సర్పంచ్ గంగపూరం కృష్ణారెడ్డి, ఎంపీటీసీ రాంచంద్రారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్స్ వినియోగిస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం: నిషేధిత ప్లాస్టిక్ కవర్స్ వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని పలు షాపులు, హోటల్స్, వీధి వ్యాపారుల దుకాణాల్లో వారు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్స్‌ను స్వాధీనం చేసుకొని దుకాణాదారులకు జరిమానాలు విధించారు. మరోసారి వినియోగిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

15వ వార్డులో పారిశుద్ధ్య పనులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని ఉదయనగర్ కాలనీలో గురువారం మురుగు కాలువలు, పరిసరాలను మున్సిపాలిటీ సిబ్బంది శుభ్రం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఉదయనగర్ కాలనీలో మురుగు కాలువలు నిండటంతో పాటు ఇళ్ల మధ్య వర్షపునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ ప్రత్యేక చొరవతో గురువారం మున్సిపల్ సిబ్బందితో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. రోడ్లు, ఇళ్ల మధ్య నీరు నిలువకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఆఫీసర్ ఎల్లయ్య, వార్డు ఆఫీసర్ సంతోష, మున్సిపల్ సిబ్బంది చిన్నా, చిట్టిబాబు, గోపాల్, నర్సింహ, ప్రశాంత్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఉత్సవాలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం గురువారంతో ముగిసింది. మూడురోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో చివరిరోజు పూర్ణాహుతి, చక్రస్నానం, సత్యనారాయణ వ్రతం, రథోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నేడు విత్తన మేళా

తలకొండపల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వారి ఆధ్వర్యంలో ఈనెల శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అలాగే పంటల గురించి సమగ్ర సమాచారం, అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

చామంతి సాగు భలే బాగు

పూల తోటలకు ఇదే మంచి సమయం

- రాబడి ఆశాజనకం
- ఆసక్తి చూపుతున్న రైతులు



మాచన్‌పల్లిలో జర్మన్ పూలసాగు

షాబాద్: చామంతి పూలసాగుకు ఇదే మంచి సమయం రానే వచ్చింది. దీంతో పొలాలను సిద్ధం చేసుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు. పండుగలు, పెళ్లిళ్లు, పూజలకు చామంతి పూలను ఎక్కువగా ఉపయోగిస్తారు. దీంతో వాటికి డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. రాబడి కూడా అదే మాదిరిగానే వస్తుంది. చామంతి సాగుకు నల్లరేగడి, బరక నేలలు అనుకూలంగా ఉండడంతో వాటి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏటా వందలాది ఎకరాల్లో చామంతి, బంతిపూలను రైతులు వేస్తున్నారు. ఎక్కువమంది రైతులు చామంతి సాగుకే ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక్కోరైతు కనీసం రెండు నుంచి మూడెకరాలకు తగ్గకుండా నాలుగు రకాల చామంతి పూలను సాగు చేస్తూ ఆదాయం గడిస్తున్నారు.

పంట కాలం...

చామంతి సాగు జూన్, జూలై నెలలోనే సాగవుతుంది. సరిగ్గా ఆరు నెలలకు దిగుబడి వస్తుంది. ఆ సమయంలో కార్తీకమాసం, పండుగలు, పెళ్లిళ్ల వరుసగా వస్తుండడంతో పూలకు మంచి గిరాకీ ఉంటుందని రైతులు చెబుతున్నారు.

సాగు చేసే గ్రామాలు...

షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్, అంతారం, రుద్రారం, సోలిపేట్, మద్దూర్, మాచన్‌పల్లి, పోలారం, పోతుగల్, చర్లగూడ, ఎల్గొండగూడ, చందనవెల్లి, తిర్మలాపూర్, అంతిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో కనీసం 50నుంచి 70ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అందులో తెలుపు, క్యారెట్, మేరిగోల్డ్, పేపర్‌వైట్, పసుపు, వంగపూత, ఎగ్‌వైట్ రకాల పంటలను వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, బెంగళూర్ తదితర రాష్ట్రాల నుంచి మొక్కలను తెచ్చుకుంటారు. ఒక్కో మొక్క రకాన్ని బట్టి రూ.1 నుంచి రూ.3 వరకు పలుకుతోంది. ఎకరా విస్తీర్ణంలో చామంతి సాగుకు రూ. 60వేల వరకు ఖర్చవుతుంది. రెండు నెలల పాటు వారంలో రెండు కోతలు దిగుబడులు వస్తాయి. పంటకాలం పూర్తయ్యేలోగా ఎకరాకు దాదాపు 8 టన్నుల వరకు దిగుబడి అందుతుందని రైతులు చెబుతున్నారు. పండగల సమయంలో దాదాపు కేజీ చామంతి పూలు రకాన్ని బట్టి రూ.70 నుంచి రూ.120 వరకు ఉంటుంది.



సర్దార్‌నగర్‌లో చామంతి పూల తోటను సాగు చేస్తున్న రైతులు అమృత్‌రాజు, స్వప్న

పెళ్లిళ్ల సీజన్‌లో మంచి డిమాండ్



ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా చామంతిని సాగు చేయాలని సిద్ధం చేసుకున్నా. వైట్, రెడ్, వంగపూత రకాల సాగు చేస్తున్నాను. పెళ్లిళ్ల సీజన్‌లో చామంతికి మంచి డిమాండ్ ఉంటుంది. ముందునుంచే పూల సాగుకు పొలం సిద్ధం చేసుకున్నాను.

– దాదె అమృత్‌రాజు, రైతు సర్దార్‌నగర్

రెండెకరాల్లో నాలుగు రకాల పూలు



ప్రస్తుతం రెండెకరాల్లో నాలుగు రకాల పూల సాగు చేస్తున్నాను. దిగుబడి వచ్చే సమయానికి కార్తీకమాసం పెళ్లిళ్లు, పండుగలు వస్తాయి. ఆ సమయంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది. కూరగాయలతో పాటు పూలసాగు వేస్తున్నా. దీంతో వాటికి రాబడి కూడా ఎక్కువ ఉంటుంది.

– గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో గురువారం అనంత పద్మనాభస్వామి ఆలయంలో నిర్వహించిన స్వామివారి కల్యాణంలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనితారెడ్డితో పాటు పలువురు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంజర్లలో వెలసిన అనంత పద్మనాభస్వామి ఆలయానికి విశిష్టమైన చరిత్ర ఉందన్నారు. ఇక్కడ భక్తులు కోరిన కోరికలు తప్పకుండా తీరుతాయని చెప్పారు. భక్తుల విశ్వాసంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో ఈ ఆలయానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కొత్తూరు ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, శివశకంర్‌గౌడ్, అగ్గనూరు విశ్వం, జె. సుదర్శన్‌గౌడ్, కృష్ణ, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ



బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి పార్టీ నాయకులతో కలిసి వెళ్లి శాలువా కప్పి, బొకే అందజేసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం షాద్‌నగర్‌లో చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి తన సహకారం అందించి త్వరలో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

క్రీడలతో ఆరోగ్యం

- స్నేహం కోసం టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయం
- బీజేపీ జిల్లా కార్యదర్శి జి వెంకట్‌రెడ్డి



విజేత జట్టు ప్రైజ్ మనీని స్నేహితుని కుటుంబసభ్యులకు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: స్నేహం కోసం టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని బీజేపీ జిల్లా కార్యదర్శి జి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని చనువెల్లి గ్రామంలో గురువారం ఎండీ నిజాముద్దీన్, ఎం. విజయ్‌కుమార్‌ల స్మారక క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, గ్రామ నాయకుడు శ్రీనివాస్‌చారి బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో యువకులంతా కలిసి గ్రామ పెద్దల సహకారంతో మృతి చెందిన స్నేహితుల జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడంతో పాటు బాధిత కుటుంబాలకు కూడా సహాయం చేయాలనే ఆలోచన హర్షించదగ్గ విషయమన్నారు. స్నేహితుల కుటుంబాలకు సహాయం చేయడంతో పాటు ఈ క్రీడలతో యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయొచ్చన్నారు. అంతేకాకుండా క్రీడలతో ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. విజేతగా కేకేఆర్ జట్టు నిలిచిందని, సీఎస్‌కే రన్నరప్‌గా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. విజేత జట్టు ప్రైజ్‌మని రూ.30వేల నగదును ఇదే వేదికపై స్నేహితుడు ఎండీ నిజాముద్దీన్ కుటుంబసభ్యులకు, రన్నరప్‌గా వచ్చిన ప్రైజ్ మనీ రూ.15వేలు కూడా ఎం. విజయ్‌కుమార్ కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం నిర్వాహకులు యు. నర్సింలు, కె. రమేశ్, శ్రీనివాస్, విశాల్, నాగేశ్, రవివర్మలు మాట్లాడారు. టోర్నమెంట్‌కోసం గ్రామ పెద్దలు పూర్తి సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి. రాజేందర్‌గౌడ్, జి. వెంకట్‌రెడ్డి, పి. ప్రభాకర్‌రెడ్డి, పి. భూపతిరెడ్డి, వి. జంగారెడ్డి, తిరుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకటేశ్, బాలక్రిష్టారెడ్డి, నర్సింలు, దీపక్‌రెడ్డి, జంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చింటు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకా తప్పనిసరి

పశువైద్య అధికారి దేవిరెడ్డి



షాబాద్: రేగడిదోస్వాడలో టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో గొర్రెలకు టీకా వేస్తున్న వైద్యాధికారి దేవిరెడ్డి

మొయినాబాద్ రూరల్: పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని అమ్డాపూర్ పశువైద్య అధికారి దేవిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో 800 గొర్రెలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 31వరకు ఈ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు చెప్పారు. గొర్రెలు, మేకలు ఉన్న ప్రతీరైతు గొంతు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా వేయిస్తున్న ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో...

షాబాద్: గొర్రెలకు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కుమ్మరిగూడ, హైతాబాద్, రేగడిదోస్వాడ గ్రామాల్లో పశువులకు గొంతువాపు, తొడవాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెలకు, మేకల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

మండల వ్యవసాధికారిణి తులసి



చేవెళ్ల: మండల వ్యవసాయ కార్యాలయం

చేవెళ్ల: రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాధికారిణి తులసి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 60శాతం సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వీటిని శుక్రవారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చేవెళ్ల మండలానికి సంబంధించి రైతుల కోసం 240 క్వింటాళ్ల జనుము, 8.7క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జనుము 40కిలోల బస్తా సబ్సిడీ పోను రూ. 1,448లు చెల్లించాలని, జీలుగ విత్తనాలకు 30కిలోల బస్తాకు రూ.1,116లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్ జిరాక్స్‌లను తీసుకొని ఆయా గ్రామాల రైతు వేదికల వద్ద వ్యవసాయ విస్తారణ అధికారులను కలిసి పర్మిట్ రాయించుకోవాలని చెప్పారు. పర్మిట్‌లు రాయించుకున్న రైతులు మండలంలోని ముడిమ్యాల పీఏసీఎస్ వద్ద అందుబాటులో ఉన్న ఈ విత్తనాలను తీసుకోవాలని కోరారు. మండలంలోని రైతు వేదికల వద్ద ఉదయం 9–30 గంటల నుంచి వ్యవసాయ విస్తారణ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గులో పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసుకోవడం కోసం రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేశారు. ఒక హెక్టారుకు 40 కిలోల చొప్పున, ఒక్కో రైతుకు రెండు బస్తాల జనుము విత్తనాలు అందించారని ఏఓ శిరీష తెలిపారు. సబ్సిడీ పోను 40 కిలోల బస్తాకు రూ.1450లకు విక్రయించినట్లు చెప్పారు. కొందుర్గు ఆగ్రోస్ ద్వారా 100 క్వింటాళ్లు, పీఏసీఎస్ ద్వారా 80 క్వింటాళ్లు, రామచంద్రాపూర్ ఆగ్రోస్ ద్వారా 40 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేశారన్నారు. కాగా రైతులు పచ్చిరొట్ట ఎరువు విత్తనాల కోసం ఆగ్రోస్ సెంటర్ల వద్ద ఉదయంనుంచి క్యూలైన్లో ఉన్నట్లు చెప్పారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

మంచాల: స్థానిక సంస్థల ఎన్నికలకు నేతలు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య అన్నారు. గురువారం మంచాల బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనుందని అన్నారు. తదనుగుణంగా గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు పోటీకి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు జంగయ్యగౌడ్, జిల్లా నాయకుడు శ్రీశైలం, మండల ప్రధాన కార్యదర్శులు రాజు, రాజేందర్‌రెడ్డి, నాయకులు.. పాండు, శేఖర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ నాయక్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్ నాయక్‌ను బీజేపీ పార్టీ యాచారం మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ బుధవారం కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. తప్పకుండా ఎస్టీల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు గణేష్ నాయక్, మంతన్‌గౌరెల్లి బూత్ అధ్యక్షుడు ప్రసాద్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పెద్దఅంబర్‌పేట రెవెన్యూ సర్వే నంబర్ 244లోని ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 244లోని ప్రభుత్వ భూమిలో కొంతభాగంగా ఔటర్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కింద ప్లాట్లు ఇవ్వగా.. మిగిలిన భూమిని పీఓటీ ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పట్టాపాసుపుస్తకాలను రద్దు చేసిందన్నారు. అయితే విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఈ భూములకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో ఆక్రమణదారులు కబ్జాలకు పాల్పడంతో పాటు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

కనులపండువగా కల్యాణం



స్వామివారికి తలంబ్రాలు పోస్తున్న పూజారులు

ఇబ్రహీంపట్నం రూరల్: పోచారం గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం గురువారం కనులపండగగా జరిగింది. స్వామివారిని దర్శించుకోవడానికి పోచారం, కర్ణంగూడ తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్‌గౌడ్, అరుణ నరేందర్, దేవాలయ కమిటీ చైర్మన్ దాయి నరేష్ , నాయకులు వెంకటేశ్, చిన్నా, శ్రీశైలం, రమేష్, తిరుమల్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.